పత్తికర్రతో ఆదాయం..!



వాహనాల్లో నింపుతున్న పత్తికర్ర

- బ్రికెట్స్ తయారీకి వినియోగం
- రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

తాంసి: రైతులు సాగుచేసిన పత్తి చేతికొచ్చిన తరువాత పంటచేల్లో నిరుపయోగంగా మారే పత్తి కర్రలతో రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదు. పంటచేలలో ఉపయోగం లేని పత్తికర్రలను రైతులు తీసివేసి కాల్చి వేస్తుంటారు. కాని ఇప్పుడు పత్తి ఏరివేత పూర్తయిన తరువాత పత్తికర్రలతో రైతులకు కొత్త ఆదాయం వస్తోంది. పత్తికర్రలను బ్రికెట్స్ తయారీ కోసం వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తికర్రలకు ఎకరాల చొప్పున డబ్బులు చెల్లించడంతో రైతులకు సాగుచేసిన పత్తి పంటతో పాటు వృథాగా మారే పత్తికర్రలతో సైతం కొంత ఆదాయం వస్తుంది. పంటచేల నుంచి పెద్దఎత్తున పత్తికర్రలను కొనుగోలు చేసేందుకు పలువురు ముందుకొస్తున్నారు.

ఎకరం పత్తికర్రకు రూ.300..

పత్తికర్రలకు ఎకరానికి రూ.300 చొప్పున చెల్లించి తీసుకెళ్తున్నారు. జిల్లాతో సాగుచేసే పత్తి పంట కాలం ముగియడంతో పత్తికర్రను బ్రికెట్స్ తయారీకి తీసుకెళ్లేందుకు వ్యాపారులు ముందుకువస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఏర్పాటు చేసిన పరిశ్రమలో బ్రికెట్స్ తయారీకి కావాల్సినంత పత్తికర్రను నిర్వాహకులు తీసుకెళ్తున్నారు. ప్రతీ రోజు తాంసి, భీంపూర్ మండలాలోని ఆయా గ్రామాల నుంచి పత్తికర్రను బ్రికెట్స్ కోసం సరఫరా చేస్తున్నారు.

బ్రికెట్స్ తయారీ కోసం..

రైతుల పంటచేల నుంచి ఫ్యాక్టరీకి తీసుకెళ్లిన పత్తికర్రను బ్రికెట్స్ తయారీ కోసం నిల్వ చేస్తున్నారు. నిల్వ చేసిన పత్తికర్రను యంత్రం సాయంతో పిప్పిగా చేస్తారు. పిప్పిని యంత్రంలోకి పంపగా ప్రెసింగ్ చేయడంతో బ్రికెట్స్ తయారు అవుతాయి. పత్తికర్రలతో తయారు చేసిన బ్రికెట్స్ పొగ రాకపోవడంతో పాటు పర్యావరణంకు అనుకూలంగా ఉంటాయి. ప్రస్తుతం పలుచోట్ల కర్రకు బదులుగా బ్రికెట్స్‌ను అధికంగా ఉపయోగిస్తున్నారు. మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో అవసరం మేర తయారు చేస్తూ సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం కిలో బ్రికెట్స్ రూ.6 నుంచి రూ.7 వరకు పలుకుతోంది.

పంట చేలకు వచ్చి తీసుకెళ్తున్నారు



పంటచేలలో పత్తిపంట తీసిన తరువాత నిరుపయోగంగా మారే పత్తికర్రను బ్రికెట్స్ తయారీకి కొనుగోలు చేసి తీసుకెళ్లడం సంతోషంగా ఉంది. బ్రికెట్స్ తయారీకి పత్తికర్రను ముడిసరుకుగా వాడటంతో పత్తికర్రకు డిమాండ్ పెరిగింది. ఎకరానికి రూ.300 చొప్పున చెల్లిస్తున్నారు.

– అండే ఆనంద్, పొన్నారి, రైతు

రైతులకు మేలు



పత్తికర్రను కాల్చడంతో భూసారం దెబ్బతింటుంది. వ్యవసాయ శాఖ తరుపున కాల్చవద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం పత్తికర్రలను బ్రికెట్స్ తయారీకి కొనుగోలు చేయడంతో రైతులకు మేలు జరుగుతుంది.

– రవీందర్, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

‘వెంకటేశ్ నేత క్షమాపణ చెప్పాలి’



మాట్లాడుతున్న కొప్పుల రమేశ్

ఆదిలాబాద్‌టౌన్: చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వెంకటేశ్ నేత వెంటనే క్షమాపణ చెప్పాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వివేక్ వెంకటస్వామిపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మాలల జనాభాను అడ్డుపెట్టుకొని ఎస్సీ వర్గీకరణను స్వప్రయోజనాల కోసం అడ్డుకుంటున్నారని పేర్కొనడం సరికాదన్నారు. సమావేశంలో మాల సంక్షేమ సంఘం నాయకులు మేకల మల్లన్న, యేర సుధీర్, పాశం రాఘవేంద్ర, సింగరి అశోక్, స్వామి, భూమన్న, నర్సిములు, రాజు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు’



మాట్లాడుతున్న దర్శనాల మల్లేశ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ 2 కోట్ల ఉద్యోగాల కల్పన హామీని గాలికి వదిలేసిందన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి 8 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు, ఒక కేంద్ర మంత్రి ఉన్నప్పటికీ ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఓడించాలని కోరారు. సమావేశంలో లంకా రాఘవులు, బండి దత్తాత్రి, మంజుల, కిష్టన్న, ఆశన్న, స్వామి, చిన్నన్న, శకుంతల పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇంటింటా సర్వే నిర్వహించి ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. తర్వాత సూపర్ చెక్ ద్వారా లబ్ధిదారుల పేర్లను యాప్‌లో లాగిన్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన తుది జాబితాను పరిశీలిస్తున్నామన్నారు. అర్హులైన వారికి గృహ నిర్మాణం శాఖ ద్వారా మార్క్‌ఔట్ ఇచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఆయన వెంట పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: సిమెంట్ ఇటుకల తయారీ యూనిట్ కోసం స్వయం శక్తి మహిళా సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బోథ్ ఏపీఎం మాధవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోథ్ మండలానికి 3 యూనిట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఒక్కో యూనిట్ ధర రూ. 18 లక్షలు ఉంటుందన్నారు. తయారు చేసిన ఇటుకలను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 91211 02020 సంప్రదించాలని కోరారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం



ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు లక్కారం, గంగన్నపేట కాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీలు పూడికతో నిండాయి. మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రజలు రోగాల భారీన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఊరేగింపు నిర్వహిస్తున్న శివ దీక్షదారులు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయంలో సోమవారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు గ్రామానికి చెందిన దంపతుల చేత యజ్ఞం నిర్వహించారు. ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయంలో గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన, జోడు నాగుల విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టారు. వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణాన్ని భక్తులు తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

తాంసి: మండల కేంద్రంలో సోమవారం శివదీక్షాదారులు శివపార్వతుల పల్లకిని ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉత్సవమూర్తులను ఉంచి శివాలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. గ్రామం శివనామస్మరణతో మార్మోగింది. మహిళలు మంగళహారతులతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శోభాయాత్ర విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అజయ్

ఆదిలాబాద్‌టౌన్: మహాకాల్ సేన ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన ఆదిలాబాద్ పట్టణంలోని రాంలీలా మైదానం నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు మహాకాల్ సేన అధ్యక్షుడు అజయ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా తమ మహాకాల్ సేన ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జయ్‌రాం, సృజన్, కృష్ణ, శ్రీకాంత్, సుధీర్, సుశీల్, ప్రశాంత్, భుపేందర్, లోక ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

- ఎంపీ గోడం నగేశ్



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

ఇచ్చోడ: నాయకులు, కార్యకర్తలు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోవాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రతీ నాయకుడు వారి వారికి ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ.. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు పతాంగే బ్రహ్మానందం, తాటిపెల్లి రాజు, రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా పార్టీల నాయకులు ప్రచారం జోరుగా కొనసాగిస్తున్నారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్య ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, కొలిపాక రాజశేఖర్, బింగి వెంకటేశ్, రాజేశ్వర్, ఆశన్న, రమేశ్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. స్థానిక శివకళ్యాణ మండపంలో బీజేపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు మండలంలోని ప్రతీ ఒక్క ఓటరును సంప్రదించి బీజేపీ పథకాలను వివరించాలన్నారు. నాయకులు ఆ దిశగా కార్యచరణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తాటిపెల్లి రాజు, కేంద్రే లక్ష్మణ్, కేంద్రే శివ, గణేష్ పాటిల్, వామన్‌గిత్తే, శైలేందర్, జగన్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామం రాజురలో జగదాంబదేవి సంత్ సేవాలాల్ మహరాజ్, రామారావు మహరాజ్ ఆలయ 5వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బంజారా ధర్మగురు దేవి భక్త శేఖర్ మహరాజ్‌చే ప్రత్యేక పూజలు జరిపించి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులందరు ఆలయం వద్దకు చేరి ప్రత్యేక పూజలు చేశారు. జగదాంబ దేవి ఆశీస్సులు ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలపై ఉండాలని వేడుకున్నారు.

మౌలిక సదుపాయల కల్పనకు కృషి



వివరాలు సేకరిస్తున్న జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మరాయినగర్, సుందర్‌నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశాలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి సందర్శించి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఏమాయికుంట, ఇంద్రవెల్లి పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. రమాయినగర్, సుందర్‌నగర్ గ్రామ సమస్యలు, స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల అధికారులతో కలిసి గ్రామానికి సందర్శించి ప్రజలతో మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మేజర్ గ్రామపంచాయతీ ఈవో సంజీవ్‌రావు, ఏమాయికుంట పంచాయతీ కార్యదర్శి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచకప్ క్రీడాకారుడికి సన్మానం



శివారెడ్డిని సన్మానిస్తున్న జోగు రామన్న

కైలాస్‌నగర్: ఇటీవలలో ఢిల్లీలో జరిగిన ఖోఖో ప్రపంచకప్‌లో ప్రాతినిధ్యం వహించిన ఆదిలాబాద్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ క్రీడాకారుడు శివారెడ్డిని మాజీ మంత్రి జోగు రామన్న సోమవారం సన్మానించారు. పూలమాల, శాలువాతో సత్కరించారు. మిఠాయిలు తినిపించి అభినందించారు. ఖోఖో ప్రపంచకప్‌లో మహిళ, పురుషుల జట్టు విజేతలుగా నిలువడం అభినందనీయమన్నారు. జాతీయస్థాయిలో చోటు దక్కించుకోవడంతో పాటు పోటీల్లో రాణించడం అభినందనీయమని కొనియాడారు. నాయకులు సాజిదోద్దీన్, దమ్మపాల్, సతీష్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లాలో జరిగిన ప్రచార కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి కలిశారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సీఎంతో మాట్లాడారు. తన మొబైల్‌లో రూపొందించిన రిప్రజంటేషన్‌ను సీఎంకు చూపించగా.. దాన్ని చూసి అభినందించారు.

కందుల కొనుగోళ్ల పరిమితి పెంపుపై హర్షం

కైలాస్‌నగర్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించే పంటలను కొనుగోలు చేయడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని డీసీసీబీ డైరెక్టర్, జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలురి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎకరాకు 3 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేస్తుండగా దానిని 6 క్వింటాళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. జిల్లాకు 1,85,890 క్వింటాళ్ల కందుల కొనుగోలును టార్గెట్‌గా నిర్ణయించందన్నారు. అలాగే రైతులు మార్క్‌ఫెడ్‌కు మూడు లక్షల నలభై వేల క్వింటాళ్ల సోయాబీన్‌కు రూ.166 కోట్ల బిల్లులను విడుదల చేసినట్లుగా తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామంలో సోమవారం విద్యుత్‌షాక్ గురై ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన అనిల్ అనే రైతుకు చెందిన ఎద్దు పంట చేనులో పశుగ్రాసం తింటున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైంది. ఎద్దు విలువ దాదాపుగా రూ.50 వేల వరకు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాడు.

క్రీడలతో మానసికోల్లాసం



వాలీబాల్ ఆడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని దీపాయిగూడలో మహా శివరాత్రిని పురస్కరించుకొని వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. అంతకుముందు అదే గ్రామంలోని తన పంట చేనులో ఉన్న కంది పంటను పరిశీలించారు. జైనథ్ మండల రైతులు మూడు పంటలు సాగు చేసేందుకు వీలుగా సాత్నాల బ్యారేజ్‌తో పాటు లక్ష్మీపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, శ్రీనివాస్, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆశయంతో ప్రయత్నం చేస్తేనే విజయం

నార్నూర్: ఆశతో కాదు ఆశయంతో ప్రయత్నం చేస్తేనే విజయం సాధ్యమవుతుందని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలోని డాబా(బి) గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. యువత అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. ఆటలతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢ సంకల్పం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అనిల్, ఆత్రం విజయ్, మెస్రం గోవింద్, సోనేరావు, బాదిరావు, పెందూర్ తానాజీ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఏఎస్సై రమేశ్

సిరికొండ: మండలంలోని కోండపూర్ శివారులో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఏఎస్సై రమేశ్ పాల్గొని ప్రారంభించారు. ఈపోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 8111, రెండో బహుమతిగా రూ. 4111లని అందజేయనున్నట్లు పేర్కొన్నారు.



కొట్టుకుపోయిన కల్వర్టు



కోతకు గురైన పాటగూడ కల్వర్టు

పొంచి ఉన్న ప్రమాదం

ఇంద్రవెల్లి: మండలంలోని మారుమూల గ్రామాల్లోని రోడ్లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. మండలంలోని సాలేగూడ గ్రామం రోడ్, పాటగూడ, ఖైరిగూడ, బుర్సన్‌పటర్, వడగామ్, లాల్‌టెకిడి, పిట్టబోంగరం, హర్కపూర్, వాల్గోండ గ్రామాల రోడ్లు వర్షాకాలంలో కురిసిన వర్షాలకు కోతకు గురయ్యాయి. అయినా.. ఇప్పటికీ అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భూమన్న మరణం తీరని లోటు

కైలాస్‌నగర్: గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి భూమన్న అకాల మరణం తీరనిలోటని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా బొంపెల్లి భూమన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కుంభమేళాలో డీసీసీబీ చైర్మన్ పుణ్యస్నానం

కైలాస్‌నగర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి దంపతులు పాల్గొన్నారు. సోమవారం కుటుంబీకులతో కలిసి త్రివేణి సంగమంలో పూజలు చేసి, పుణ్య స్నానాలను ఆచరించారు.

భారీ కాన్వాయ్‌తో సీఎం సభకు

ఉట్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార సభకు సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భారీ కాన్వాయ్‌తో తరలివెళ్లారు.

ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఆదివారం నిర్వహించిన గోండి ధర్మగురు హీరాసుక జయంతి వేడుకలకు ఆదివాసీ పర్దాన్ సమాజ్ నాయకులు, కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసినందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పూసం ఆనంద్‌రావ్, సభ్యులు సెడ్మకి సుభాష్, మడావి దిగంబర్ పాల్గొన్నారు.

రేపు ఆకోలి గ్రామ డాక్టర్లకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: భోరజ్ మండలంలోని ఆకోలి గ్రామ డాక్టర్లకు, వారి తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు, రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ కమ్మల నర్సిములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలోని న్యూహౌజింగ్ బోర్డు పొచ్చమ్మ గుడి సమీపంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.